క్లుప్తంగా

కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడిగా దేవుసింగ్



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడిగా భట్టు దేవుసింగ్‌ను నియమించినట్లు అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య బుధవారం తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం



మరిపెడ రూరల్: మండలంలోని నీలికుర్తి గ్రామ శివారు భజనతండాకు చెందిన గుగులోతు చంటి నాయక్‌కు అర్థశాస్త్ర విభాగంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ బి.సుధాకర్‌రెడ్డి, ఇంపాక్ట్ ఆఫ్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ జీఎస్టీ ఆన్ ఇండియన్ ఎకానమీ ఇన్‌కేస్ స్టడీ ఆఫ్ తెలంగాణ స్టేట్ పరిశోధనకు ఓయూ నుంచి డాక్టరేట్ దక్కింది. టీజీ సెట్ అండ్ యూజీసీ నెట్ జెఆర్ఎఫ్ సాధించి ఉస్మానియా యూనివర్సిటీ అర్థశాస్త్రం డాక్టరేట్ సాధించాడు.

ఉర్సు వేడుకలు



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపుసపల్లి గ్రామంలో గల హజరత్ సయ్యద్ ఇమామ్ షావలి దర్గాలో బుధవారం ఉర్సు వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య పర్యవేక్షణలో రూరల్ ఎస్సై దీపికరెడ్డి, ఏఎస్ఐ రహమత్ అలీ, హెడ్‌కానిస్టేబుల్ రమేష్, పీసీలు విజయ్, బాపూజీ, కిషన్ బందోబస్తు నిర్వహించారు.

నర్సింగ్ కోర్సులో శిక్షణ

కురవి: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతులకు ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ, హెచ్ఎస్‌బీసీ సహకారంతో హైదరాబాద్‌లోని ప్రథం హెల్త్ కేర్ శిక్షణ కేంద్రంలో రెండు నెలల పాటు నర్సింగ్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ సరిత సింగు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ పూర్తి అయిన వారికి ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. రెండు నెలల నర్సింగ్ అసిస్టెంట్ కోర్సుకు 18–30 ఏళ్ల లోపు వయస్సు ఉండాలని, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఏఎన్ఎం, జీఎన్ఎం, డిప్లొమా లేదా ఏదేని ఒకేషనల్ కోర్సు పూర్తి చేసి ఉండాలన్నారు. ఈనెల 25 వరకు గడువు ఉందని తెలిపారు. వివరాలకు 90002 03952 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు



కొత్తగూడ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని గువ్వల బోడు సమీపంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ మండలం చిలకమ్మనగర్‌కు చెందిన సుమన్, రమేష్ సొంత పనులపై కొత్తగూడెంకు వెళ్తున్నారు. మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి, ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టి పడిపోయారు. ఈ ఘటనలో సుమన్, రమేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై దిలీప్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 ద్వారా నర్సంపేట ఆసుపత్రికి తరలించారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

కేసముద్రం: కేసముద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు బిచ్చానాయక్, వెంకన్న, రమేష్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల తనిఖీ

నెహ్రూసెంటర్: ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్వహణపై జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. వర్చువల్ పద్ధతిలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో తనిఖీలు నిర్వహించిన ఎన్ఎంసీ విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలు, వసతులు, ప్రొఫెసర్ల హాజరు పరిశీలించారు. తీరు మార్చుకోవాలని సూచించారు. దీంతోపాటు నిబంధనలు, అసౌకర్యాలు, హాజరుశాతాన్ని పరిశీలించి వైద్య కళాశాలకు కొంత జరిమానా చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

సికిల్‌సెల్ ఎనిమియాపై అవగాహన



మరిపెడ: మాట్లాడుతున్న రవికుమార్



కురవి: మాట్లాడుతున్న వైద్యులు



డోర్నకల్: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

మరిపెడ: సికిల్ సెల్ ఎనిమియాను నిర్మూలించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మరిపెడ పీహెచ్‌సీ వైద్యాధికారి గుగులోతు రవికుమార్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో బుధవారం సికిల్ సెల్ ఎనిమియా దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వ్యాధి వచ్చిన వారిలోని ఎర్రరక్తకణాలు కొడవలి ఆకారంలోకి మార్పు చెందుతాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ శాంత కుమారి, సూపర్‌వైజర్లు సుదర్శన్, వెంకటేశ్వర్లు, బాలాజీ, అనిత పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం సికిల్ సెల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు విరాజిత మాట్లాడుతూ.. ఈ వ్యాధితో రక్తహీనతకు గురవుతారని తెలిపారు. కురవి పీహెచ్‌సీ పరిధిలో రక్త పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరబాబు, ఎంపీఓ విజయలక్ష్మీ, స్టాఫ్ నర్సులు అనురాధ, కవిత, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరు: జన్యు సంబంధ మార్పుల ద్వారా ఏర్పడే సికిల్ సెల్ ఎనిమియా వ్యాధిపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ వీరన్న, డాక్టర్ యమున అన్నారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, అయోధ్యపురం పీహెచ్‌సీలో బుధవారం నేషనల్ సికిల్ సెల్ ఎనిమియాపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ వ్యాధి సాధారణంగా 6నెలల వయసులో ప్రారంభమవుతుందన్నారు. వ్యాధి కలిగిన వారిలో రక్తహీనత, కామెర్లు, కీళ్లు, ఛాతీ పెరుగుదలలో జాప్యం, ఇన్ఫెక్షన్ వంటి లక్షణాలు ఉంటాయన్నారు.

డోర్నకల్: సికిల్ సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాధ్విజ మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వీరబాబు, ఆశకార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగూడ: సికిల్ సెల్ ఎనిమియాపై అవగాహన ర్యాలీని బుధవారం గిరిజన సంక్షేమ క్రీడా ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించారు. ఈసందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి శివప్రసాద్ మాట్లాడారు. ర్యాలీలో ఏటీడీఓ భాస్కర్, పాఠశాల హెచ్ఎం దేవదాస్, ఏహెచ్ఎస్ హెచ్ఎం రాజమ్మ పాల్గొన్నారు.

పదోన్నతుల్లో న్యాయం చేయాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న సంఘాల నాయకులు

మహబూబాబాద్ అర్బన్: పదోన్నతుల్లో దళిత మహిళా ఉపాధ్యాయుల రోస్టర్ పాయింట్స్ మెయిన్స్ నింపడంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది న్యాయం చేయాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ కోరారు. బుధవారం డీఈఓ రామారావుకు సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు కోడెము రజిత, నిర్మల, ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు ఈరు నాయక్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మాలోత్ శివనాయక్, ఉపాధ్యక్షుడు రంగన్న, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం నాయకులు బొజ్జ నాయక్, మాలోత్ బద్రినాయక్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల పదోన్నతుల్లో గందరగోళం

ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన టీచర్ల పదోన్నతుల ప్రక్రియ టీచర్లకు తీవ్రనష్టాన్ని కలిగించిందని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం అన్నారు. జిల్లా కేంద్రంలోని బుధవారం ఆయన మాట్లాడారు. ఒక్కో టీచర్‌కు మూడు సబ్జెక్టుల్లో పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు, ఖాళీలన్నీ తిరిగి ఖాళీలుగానే మిగులుతున్నాయన్నారు. మహిళల కేటగిరిలో పురుషులకు పదోన్నతులు, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో సీనియర్ పేరు గల్లంతు అయ్యాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ కేటగిరిల్లో మహిళలు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రమేష్, సోమ విష్ణువర్ధన్, రాచకొండ ఉపేందర్, విద్యాసాగర్, హరిప్రసాద్, కార్తిక్, శ్యాంప్రసాద్, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేకులకు గుణపాఠం చెప్పాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

గూడూరు: రైతాంగ సమస్యలను పరిష్కరించకుండా రైతు వ్యతిరేకులుగా పాలన కొనసాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర పాలకులకు తగిన గుణపాఠం చెప్పాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు గజ్జి లింగన్న అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే జనరల్ కౌన్సిల్ సభను జయప్రదం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కొట్టెం అచ్చన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు శ్రీశైలం, జోగ వీరస్వామి, అద్దూరి వెంకన్న, కొట్టెం వజ్జయ్య, నర్సయ్య, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లికుదురు: మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ తాత్కాలిక సీఈఓ ఉద్యోగాని దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎఫ్‌పీసీ చైర్మన్ కాలేరు రమ, ఏపీఎం వరదయ్య తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 35 ఏళ్ల లోపు ఉండి, అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్, అగ్రికల్చర్ మార్కెటింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్ డిప్లమా తత్సమాన డిగ్రీ అర్హత కలిగి ఉండాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తులను ఈనెల 24లోపు మండల కేంద్రంలోని మయూరి మండల సమైక్య కార్యాలయంలో అందించాలన్నారు.

పిల్లల్లో మేధోవికాసానికి కృషి చేయాలి



శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీలు

డోర్నకల్: పిల్లల్లో చిన్నతనం నుంచే మేధోవికాసం అభివృద్ధి చెందేలా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఐసీడీఎస్ డోర్నకల్ ప్రాజెక్ట్ సీడీపీఓ ఎల్లమ్మ కోరారు. మండలంలోని చాప్లాతండాలో బుధవారం ఎర్లీ చైల్డ్‌కేర్ అండ్ ఎడ్యుకేషన్, ప్రీస్కూల్ కార్యక్రమాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సీడీపీఓ ప్రారంభించారు. అనంతరం ఎల్లమ్మ మాట్లాడుతూ.. ఒక్కో బ్యాచ్‌కు 35 మంది అంగన్‌వాడీ కార్యకర్తలను ఎంపిక చేసి పిల్లల మేధో వికాసం, భావోద్వేగ పరిస్థితులు అభివృద్ధి చెందేలా కార్యకర్తలు తీసుకోవాల్సిన అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శిక్షకురాలు వెంకటరమణ, సూపర్‌వైజర్లు గోపమ్మ, శారద, నీరజ, రమణమ్మ, వెంకటలక్ష్మి, సంపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

24న స్పాట్ అడ్మిషన్లు

కురవి: మండలంలోని నేరడ గ్రామంలోని మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి వివిధ క్లాసుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 24న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.అరుణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 22తేదీ లోపు మోడల్ స్కూల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 24న ఉదయం 11గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించి అదే రోజు సెలక్షన్ లిస్టు నోటీస్ బోర్డులో పెట్టనున్నట్లు తెలిపారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



గార్ల: సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



గూడూరు: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కురవి: కేక్ కట్ చేస్తున్న నాయకులు



పెద్దవంగరలో..



దోర్నకల్‌లో..



మహబూబాబాద్ రూరల్‌లో..

జిల్లా వ్యాప్తంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి రాహుల్‌గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. - సాక్షి నెట్‌వర్క్

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం సీజ్

నెల్లికుదురు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం బస్తాలను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ.. మండలంలోని నర్సింహుల గూడెం గ్రామ పరిధిలో ఈనెల 18న పైఅధికారుల ఆదేశాలతో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎదురుగా వస్తున్న అశోక్ లేలాండ్ వాహనాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. వాహనంలో 46బస్తాల రేషన్ బియ్యం బస్తాలు ఉన్నాయన్నారు. నర్సింహులగూడెం గ్రామానికి చెందిన వాహనం డ్రైవర్ సిద్దబోయిన భిక్షపతిని విచారించగా మహబూబాబాద్ మండలం వీఎస్‌లక్ష్మీపురం గ్రామానికి చెందిన సోమయ్య దగ్గర రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి చుట్టు పక్కల ఉన్న పౌల్ట్రీ ఫాంలకు అధిక ధరలకు విక్రయించడానికి తీసుకెళ్తున్నట్లు ఎస్సై వివరించారు. రేషన్ బియ్యంతో ఉన్న వాహనం సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గార్లలో..

గార్ల: రేషన్ బియ్యంను అక్రమంగా ఆటోలో తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ బుధవారం తెలిపాడు. ఖమ్మం సమీపంలోని పంతులునాయక్ తండాకు చెందిన లకావత్ రవి, కేలోత్ బిచ్చాలు పోచారం గ్రామంలో 1.50 క్వింటాళ్ల రేషన్ బియ్యంను అక్రమంగా కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తుండగా పోచారం రైల్వేగేట్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



మరిపెడ రూరల్: పట్టుకున్న గుడుంబా చూపిస్తున్న పోలీసులు

మరిపెడ రూరల్: మండలంలోని గాలివారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని తిలావత్ తండాలో గుడుంబా స్థావరాలపై సీఐ హత్తిరాంనాయక్ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 50లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో మరిపెడ ఎస్సై సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కురవి: సీరోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యా నాయక్‌తండా జీపీ పరిధిలోని పలుగుబోడు తండాలో సీరోలు పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. పది లీటర్ల గుడుంబా, 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు సీరోలు ఎస్సై విజయ్‌రాం కుమార్ తెలిపారు. ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొత్తగూడ: మండలంలోని రేణ్యతండా, పొగుళ్లపల్లి తండాలలోని గుడుంబా స్థావరాలపై ఎస్సై దిలీప్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. పలువురిపై కేసు నమోదు చేసి ఎక్సైజ్ శాఖకు బదిలీ చేశారు.

డోర్నకల్: మండలంలోని చాప్లాతండా గ్రామంలో బుధవారం డోర్నకల్ పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. తండాలోని ఓ ఇంట్లో 300 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి ధ్వంసం చేసి 15లీటర్ల గుడుంబా స్వాధీనపర్చుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ టౌన్, రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణ శివారులోని సాలార్ తండా, మండలంలోని సంద్రాలగుడెం గ్రామాల్లో బుధవారం పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఇరవై లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, 230 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. దాడుల్లో టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై చల్ల అరుణ, రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సకాలంలో అంబులెన్స్ చేరుకోవాలి

తొర్రూరు: ప్రజల ప్రాణాలు కాపాడేందుకు 108 సిబ్బంది కృషి చేయాలని ప్రోగ్రాం అధికారి బత్తిని మహేష్ అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని 108 అంబులెన్స్ వాహనాన్ని ఈఎంఈ అధికారి మహేష్ తనిఖీ చేశారు. అత్యవసర సమయంలో వినియోగించే పరికరాలు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈఎంటీ ఉదయ్‌కుమార్, పైలట్ నవీన్ పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ గడువు పొడిగింపు

నెహ్రూసెంటర్: రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్(గుర్తింపు కార్డు) గడువును సెప్టెంబర్ 30వ తేదీ వరకు పొడగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు.

ఆహార నాణ్యత పాటించకుంటే చర్యలు

తొర్రూరు: హోటళ్లలో ఆహార నాణ్యత పాటించకుంటే చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రోహిత్‌రెడ్డి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని బిర్యానీ సెంటర్లు, హోటళ్లలో బుధవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని మూడు బిర్యానీ సెంటర్లపై కేసు నమోదు చేశారు. తనిఖీలో మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ రాజు, సెంట్రీ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ పాల్గొన్నారు.

పరామర్శ

తొర్రూరు: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని గుర్తూరులో పీఏసీఎస్ డైరెక్టర్ మేరుగు ప్రకాశ్‌గౌడ్ తండ్రి భద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం మాజీ మంత్రి దయాకర్‌రావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జయప్రదం చేయండి

గార్ల: ఈనెల 26న నిర్వహించ తలపెట్టిన ఏఐకేఎంఎస్ జిల్లా కౌన్సిల్ సమావేశంను జయప్రదం చేయాలని సంఘం మండల సహాయ కార్యదర్శి గౌని మల్లేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం మండలంలోని మద్దివంచ గ్రామంలో జిల్లా కౌన్సిల్ వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు.

యువకుడికి గాయాలు

డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. తొడేళ్లగూడెంకు చెందిన రాజశేఖర్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ముల్కలపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు.

నీట్‌లో 726వ ర్యాంక్



గార్ల: మండలంలోని బొర్రెస క్రుతండాకు చెందిన మాలోత్ చరణ్ కు ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో 720 కి గాను 586 మార్కులు సాధించి ఆల్ ఇండియా ఎస్టీ విభాగంలో 726వ ర్యాంకు సాధించాడు. నీట్‌లో మంచి ర్యాంకు సాధించిన గిరిపుత్రుడు చరణ్‌ను తల్లితండ్రులు మాలోత్ సక్రు, జ్యోతిలతోపాటు గ్రామస్తులు అభినందించారు.

కేసు నమోదు

గార్ల: మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన బానోత్ రామి ఇంట్లో అక్రమంగా గుడుంబా అమ్ముతుండగా పోలీసులు దాడి చేసి 8లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ బుధవారం తెలిపాడు.

సరుకుల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని రెడ్యాల గ్రామానికి చెందిన దేశెట్టి భాగ్యమ్మ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబానికి మానుకోట మున్నూరుకాపు పటేల్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు, 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు శంతన్ రామరాజు, ప్రధానకార్యదర్శి పిట్టల శ్రీకాంత్, ఉద్యోగ సంఘ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేటినుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

దంతాలపల్లి: పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిదండ్రులు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని సీహెచ్ఓ బాలాజీ బుధవారం తెలిపాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి నట్టల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు.

నివాళి

నెహ్రూసెంటర్: ఆదర్శ కమ్యూనిస్టు నేత ఆకుల లక్ష్మయ్య స్ఫూర్తితో ప్రజాపోరాటాలను ముందుకు తీసుకుపోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గునిగంటి రాజన్న అన్నారు. ఆకుల లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద బుధవారం నివాళులర్పించారు.

పదోన్నతులు కల్పించడం హర్షణీయం

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులను అప్‌గ్రేడ్ చేస్తు పదోన్నతులు కల్పించడం హర్షనీయం అని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తూనం పుష్పలీల, బానోతు చాంప్లనాయక్ బుధవారం తెలిపారు.

ఇసుక డంపుల సీజ్

నర్సింహులపేట: మండలంలోని కౌసల్యదేవిపల్లి, బొజ్జన్నపేట గ్రామాల్లో బుధవారం అక్రమంగా నిల్వ చేసిన 30 పైగా ఇసుక డంపులను పోలీసు, రెవెన్యూ శాఖ అధ్వర్యంలో సీజ్ చేశారు. నేడు వేలం వేయనున్నట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

నెహ్రూసెంటర్: మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, మహిళ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఐద్వా జిల్లా నాయకురాలు స్నేహబిందు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేసు ఎత్తివేయాలి

నెహ్రూసెంటర్: రచయిత అరుంధతిరాయ్, ప్రొఫెసర్ షేక్ సంకత్ హుస్సేన్‌పై కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఉపా కేసును వెంటనే ఎత్తివేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చంద్రన్న బుధవారం తెలిపాడు.

ఒకరి అరెస్ట్

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ముడుపుగల్ గ్రామంలో ఓ వివాహితను సంద శేఖర్ అనే వ్యక్తి వేధింపులకు గురి చేయగా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి బుధవారం తెలిపారు.

కేసు పెట్టడం సరికాదు

దంతాలపల్లి: రైస్ మిల్లులో మిషనరీ అపహరించానంటూ తనపై కేసు పెట్టడం సరికాదని నాగేశ్వరరావు తెలిపాడు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని తూర్పుతండాకు చెందిన నాగమణి రైస్ మిల్లును 2044 వరకు లీజుకు తీసుకున్నట్లు తెలిపాడు. ఈ రైస్ మిల్లులో మిషన్లు పదేపదే మరమ్మతులకు గురి కావడంతో నూతన మిషన్లను తీసుకువస్తానని మిల్లు యజమానికి తెలియజేశానన్నారు. కాని మిల్లు యజమాని మిషన్లు అపహరించానని ఈనెల 13న తనపై కేసు పెట్టి అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

చర్య తీసుకోవాలి

గూడూరు: యూనియన్ బ్యాంక్ మేనేజర్‌పై చర్య తీసుకోవాలని ఎన్‌టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు రామన్ననాయక్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గూడూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ బన్సీలాల్ నిబంధనలకు విరుద్ధంగా క్రాప్ లోన్లు, పర్సనల్ రుణాలు ఇస్తూ డబ్బులు తీసుకుంటున్నాడని తెలిపాడు. ఈ విషయంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. ఫిర్యాదుపై మేనేజర్ బన్సీలాలను ఫోన్‌లో వివరణ కోరగా.. బానోతు రామన్ననాయక్ అనే వ్యక్తి నిబంధలనకు విరుద్ధంగా లోన్ ఇవ్వమన్నట్లు, అంగీకరించకపోవడంతో ఆధారాలు లేని ఆరోపణలతో చేస్తున్నట్లు పేర్కొన్నాడు.

రామాలయం స్థానికతపై రగడ

బయ్యారం: మండలంలోని గంధంపల్లిలో ఉన్న రామాలయం కొత్తపేట గ్రామంలో ఉన్నట్లుగా రికార్డులో ఎక్కించటంపై గంధంపల్లి వాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం గంధంపల్లికి చెందిన పలువురు విలేకరులతో మాట్లాడుతూ... గంధంపల్లి గ్రామంలోని రామాలయంను కొందరు కొత్తపేటలో ఉన్నట్లు తప్పుడు పత్రాలు సృష్టిస్తున్నారన్నారు. దేవాదాయశాఖ విడుదల చేసిన రిజిస్ట్రేషన్ ప్రకటనను కొందరు ఉద్దేశపూర్వకంగా దాస్తున్నారన్నారు. రామాలయం గంధంపల్లిలో ఉన్నట్లు రికార్డులో చేర్చాలన్నారు. కార్యక్రమంలో స్థానికులు శరత్, రామచంద్రయ్య, కృష్ణ, శ్రీను, రాము, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



మహబూబాబాద్ రూరల్: విత్తనాలు, పురుగుమందుల దుకాణాల యజమానులు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. పట్టణంలోని విత్తన, పురుగుమందుల దుకాణాలలో ఏఓ తిరుపతిరెడ్డి, టౌన్ సీఐ దేవేందర్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో ఉన్న పత్తి, మిర్చి విత్తన ప్యాకెట్లను పరిశీలించి తయారు తేదీ, గడువు తేదీ, లాట్ నెంబర్, కంపెనీ పేరు తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అమ్మాలని, ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువతో అమ్మితే లైసెన్సుల రద్దుకు సిఫారసు చేస్తామన్నారు.

కల్తీ మద్యం విక్రయిస్తున్నారని ఆందోళన



గూడూరు: మద్యం ప్రియులకు అవసరమైన మద్యం నిల్వలను అధిక ధరలకు బెల్టు షాపులకు విక్రయిస్తూ, షాపుల్లో కల్తీ మద్యం విక్రయిస్తున్నారని ఆందోళన చేసిన సంఘటన బుధవారం మండల కేంద్రంలోని గణేష్ వైన్ షాపు ఎదుట జరిగింది. వివరాల ప్రకారం.. కొంతకాలంగా మండల కేంద్రంలోని 3 మద్యం షాపుల యజమానులు మద్యాన్ని అధిక ధరలకు బెల్టు షాపులకు విక్రయిస్తూ, కొత్తరకం మద్యాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్నారని మద్యం ప్రియులు ఆరోపించారు. ఎక్సైజ్, పోలీసులకు తెలిపినా మామూళ్లు తీసుకుంటూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దాదాపు గంటకు పైగా మద్యం ప్రియులు షాపు ఎదుట ఆందోళ కొనసాగించినా ఎవరూ రాకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
ఐ. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646